# మానవుడే దేవుడయితే?

"రా అపర్ణా! నీ కోసం తేజా వచ్చేసి ఉంటాడు. నేనూ మా ఆఫీసుకి వెళ్ళాలి" అంటూ ఆమె బుగ్గ మీద చిటిక వేసి బ్రీఫ్ కేస్ అందుకుంటూ వెళ్ళబోతున్న భూపేన్ చెయ్యి పట్టుకుని "అంకుల్! నాకో సహాయం చెయ్యగలరా?" అంటూ దీనంగా ముఖం పెట్టిన అపర్ణ వైపు షాక్ కొట్టినట్లు ఒక్కడుగు వెనక్కి వేసి చూశాడు భూపేన్.

"ఓ కాల్‌గళ్, అందునా రాత్రంతా తనతో గడిపిన వేశ్య తన్ని 'అంకుల్' అని పిలవడమా? వేశ్యలకి వావి, వరసలుంటాయా? లేక నీ కూతురి వయసు దాన్నని వెక్కిరించడమా? ఏమిటీ ఈ అమ్మాయి ఉద్దేశం" అనుకుంటూ "నేను నీకు చెయ్య గలిగిన సహాయం ఏమిటుంది. ఇంకా డబ్బు కావాలా?" అంటూ పర్సు తియ్యబోయిన భూపేన్‌ని వారిస్తూ ఓ చీటీ అతనికిచ్చింది అపర్ణ. ఆ చీటీ అందుకుని మడత విప్పి చూశాడు ఒక్కసారి ఆ చీటీకేసి, ఆమెకేసి మార్చి మార్చి చూశాడు. అందులో హైదరాబాద్‌లో ఉంటున్న ఒక వ్యక్తి అడ్రసు, క్రింద తన పేరు మాలతి అనీ, ఇక్కడే తనుండే ఏరియా అని రాసి ఉంది. తిరిగి అపర్ణకేసి చూసి "ఈ అడ్రసు ఎవరిది? నాకెందుకిచ్చావు? నేను నీకేం సహాయం చేయాలి?" అన్నాడు భూపేన్.

"ఈ అడ్రస్‌లో ఉంటున్న రాజశేఖరం గారు మా నాన్న. ఆయనకి నేనిక్కడున్నానని చెప్పి, నన్ను ఈ నరకం నుంచి విడిపించి, మళ్ళీ కూతురిగా స్వీకరించమని నేను ప్రాధేయపడుతున్నానని చెప్పండంకుల్. నేనీ మురికి కూపంలో బ్రతకలేకుండా ఉన్నాను" అంటూ ధారగా కారుతున్న కన్నీటిని కొంగు అడ్డం పెట్టుకొని దుఃఖిస్తున్న అపర్ణ వైపు చూసిన భూపేన్ మనసుని ఎవరో పిండేస్తున్నట్లయింది. అతనికి ఏం మాట్లాడాలన్నా నోరు తెరవబడటం లేదు. ఆమెని చూస్తుంటే గుండె బాధతో బరువెక్కిపోతోంది.

భూపేన్ పెద్ద బిజినెస్ మేగ్‌నెట్. అతనికి నెలకి రెండు మూడుసార్లు ఢిల్లీ, కోల్‌కతాల్లాంటి నగరాలు తిరిగి బిజినెస్ వ్యవహారాలు చూసుకుని తిరిగి వెళ్ళడం అలవాటే. లక్షలు గడించే బిజినెస్‌తో పాటు భూపేన్‌కి దుర్వ్యసనాలు కూడా చాలానే ఉన్నాయి. పేకాట, తాగుడుతో పాటు హోటల్ రూముకి అమ్మాయిల్ని రప్పించుకుని విచ్చలవిడిగా డబ్బు గుప్పించి ఆనందించడం అతనికున్న బలహీనతలు.

కొందరు వేశ్యలు డబ్బు కోసం వచ్చేవారుంటే కొందరు డబ్బు కోసం పంపబడే వారుండేవారు. డబ్బు లక్ష్యం లేని భూపేన్‌కి తన కోరికలు తీర్చుకోవడం తప్ప వారి గోల, గోడుతో నిమిత్తం ఉండేది కాదు. అలాంటి భూపేన్లో చలనం సృష్టించింది అపర్ణ. ఆమె ముఖం వైపు చూసిన భూపేన్‌కి తనేదో తప్పు చేసినట్లు గిల్టీ ఫీలింగ్ మొదటిసారిగా కలిగింది. ఇన్నేళ్ళ తన జీవితానుభవంలో ఏ ఒక్కరూ తన మనసునిలా కుదిపేసి, కరిగించిన వారు కనపడలేదు. అపర్ణ కేసి తొలిసారి అప్యాయంగా ఓ కూతురి భావంతో చూశాడు. అపర్ణకి సుమారు పాతిక సంవత్సరాల వయసుండొచ్చు.

తల దించుకుని బొటన వేలితో నేలరాస్తున్న అపర్ణ చెయ్యి తన చేతిలోకి తీసుకుని "అమ్మా అపర్ణా! అసలీ నరకంలోకి నువ్వెలా ప్రవేశించావు చెప్పు!" అంటూ ఆమెని సోఫా దగ్గరకి తీసుకెళ్ళి కూర్చోపెట్టి పక్కనే కూర్చున్న భూపేన్ వళ్ళో తల పెట్టి వెక్కి వెక్కి ఏడుస్తున్న అపర్ణ వెన్ను నిమురుతూ ఊరుకోబెట్టసాగాడు భూపేన్.

నిన్న రాత్రి ఆమె తన గదికి వచ్చిన దగ్గర నుంచి ఉదయం వరకూ ఆమె పట్ల కలిగిన భావం ఇప్పుడతనికి కలగటం లేదు. ఆమె పట్ల దయతో హృదయం ద్రవించి పోతోందిప్పుడు. ఎలాగైనా ఆమె చరిత్ర తెలుసుకుని ఆమెని బైటకి తీసుకెళ్ళి ఒక మంచి జీవితాన్ని కలిపించాలన్న భావం మనసులో కలిగింది. అవే మాటలు ఆమెకి చెప్పి హామీ ఇచ్చాడు.

కాలేజీలో చదువుకునే రోజుల్లో ఓ వ్యక్తితో ప్రేమలో పడ్డాననీ, అది తెలిసి తల్లితండ్రులు చదువు మాన్పించి ఇంట్లో బంధించారనీ, దాంతో ఓ రాత్రి తామిద్దరూ పారిపోయి ఢిల్లీ వచ్చామనీ, తన దగ్గరున్న డబ్బు, బంగారం అయిపోయే వరకూ తనని బాగా చూసుకున్నాడనీ, తరువాత అతను తనని ఒక వ్యక్తికి అమ్మేసి పారిపోయాడని, అప్పటి నుంచి ఆ వ్యక్తి నన్నిలా హోటల్‌కొచ్చే పురుషుల దగ్గరకి పంపి డబ్బు చేసుకుంటున్నాడనీ, మొదట్లో ఏడ్చి గోల పెట్టే దాన్ననీ తరువాత్తరువాత గత్యంతరం లేక నోరెత్తకుండా ఈ నరకాన్ననుభవిస్తున్నాననీ చెప్పి, "అంకుల్! మిమ్మల్ని అడిగినట్లే ఇలా వచ్చి వెళ్ళే ప్రతి వ్యక్తినీ నన్నీ చెరసాల నుంచి విడిపించమని బ్రతిమాలడం పరిపాటయిపోయింది. వాళ్ళు వెళ్ళేటప్పుడు తప్పకుండా సహాయం చేస్తామన్నవాళ్ళేగానీ ఏ ఒక్కరూ ఇంత వరకూ ఏమీ చెయ్యలేదంకుల్! మీరొక్కరే నా గురించి వివరాలడిగిన మొదటి వ్యక్తి. కనీసం మీరన్నా నన్ను

విడిపించి మా వాళ్ళదగ్గరికి చేర్పించండి అంకుల్!" అంటూ ప్రాధేయపడుతున్న అపర్ణని లేవదీసి అక్కున చేర్చుకుని "తప్పకుండా నేను చెయ్యగలిగిన సహాయం చేస్తానమ్మా" అన్నాడు భూపేన్.

అపర్ణ "అంకుల్" అన్నప్పుడల్లా అతనిలో ఏదో చలనం కలగసాగింది. అందులో ఆమె చరిత్ర విన్నాక బాధతో హృదయం కలచివేస్తోంది.

" నా కూతురు నీలిమకి కూడా ఇదే వయసుంటుంది. నీలిమ కూడా పి.జి. చేస్తోంది. ఇదే విధంగా నా కూతుర్ని కూడా ఏవరైనా దుర్మార్గుడు మోసం చేస్తే?!" అనిపించగానే "అమ్మో!" అనిపించింది. వెంటనే ఏదో నిర్ణయానికొచ్చినట్లు అపర్ణని తీసుకుని బైటకొచ్చాడు.

హోటల్ లాంజ్లో అపర్ణ కోసం కూర్చున్న వ్యక్తి, వీరిని చూడగానే భూపేన్‌కి సలామ్ కొట్టి "రా అపర్ణా! వెళ్దాం" అన్నదానికి "నీతో కొంచెం మాట్లాడాలి. సాయంకాలం వస్తావా?... ఆ మరో మాట. ఈ రాత్రికి కూడా అపర్ణని తీసుకురావాలి" అంటూ పర్సు తీసి ఇదిగో అడ్వాన్సు అంటూ అతని చేతిలో ఓ అయిదు వేల రూపాయలు పెట్టగానే మరోమారు సలామ్ కొట్టి తప్పకుండా సార్ అంటూ అపర్ణని తీసుకెళ్ళిపోయాడు.

అతని వెంట దీనవదనంతో కసాయివాడి వెనుక నడిచే మేకలా వెళ్తున్న అపర్ణని చూస్తుంటే భూపేన్ హృదయం ద్రవించిపోయింది.

చీకటి పడుతుండగా డోర్‌బెల్ మోగింది. భూపేన్ లేచి తలుపు తెరిచి వచ్చాడు. చక్కని చుక్కలా ఉన్న అపర్ణని గదిలోకి దింపిన తేజా భూపేన్‌ని చూసి సలామ్ కొట్టి వెనక్కి తిరగబోయాడు. భూపేన్ అతన్ని చూస్తూ "తేజా! ఓసారి నీతో మాట్లాడాలి. లోపలికొచ్చి ఓ పది నిమిషాలు కూర్చుంటావా?" అన్నదానికి లోపలికెళ్ళి సోఫా మీద కూర్చున్నాడు తేజా.

"తేజా! శాశ్వతంగా అపర్ణ నాకు కావాలి. ఎంత డబ్బిస్తే ఆమెని నాకమ్ముతావు?" అంటూ సూటిగా అతని ముఖంలోకి చూశాడు. షాక్ కొట్టినట్లుగా తేజా మాటా మంతీ లేకుండా భూపేన్‌ని చూశాడు. భూపేన్ మళ్ళీ అదే ప్రశ్న తిరిగి వేశాడు.

"సాబ్! అపర్ణకిప్పుడు పాతికేళ్ళు. ఇంకో ఇరవై ఏళ్ళన్నా ఈ అమ్మాయితో వ్యాపారం చేయించుకుంటే నాకు ఎంత వస్తుందో తెలుసా సాబ్! మీలాంటి వారు ఓ రాత్రికి వేలమీదిస్తే కొందరు ఓ రాత్రికి వెయ్యన్నా ఇస్తారు.

అలాంటిది నా వ్యాపారం దెబ్బతినిపించుకుని మీకెలా అమ్మేతాను సాబ్?" అన్నదానికి 'సరే! సగటు అపర్ణ వల్ల నెలకెంత గడిస్తున్నావో చెప్పు. ఆ సొమ్ముకంటే ఎక్కువే ఇచ్చేస్తానన్నదానికి అతనిలో ఏదో ఆలోచన కలిగింది. ఒక్కసారి అంత డబ్బు వస్తుందంటే మనసులో ఏదో ఆశ కూడా కలిగి ఆలోచించసాగాడు.

"లెక్క కట్టి చెప్పు. ఎంత కావాలో అది నీకిచ్చేస్తాను" అంటూ అంటూ అతనడిగిన సొమ్ము ఓ బ్రీఫ్‌కేస్‌లో పెట్టి అపర్ణని గదిలోకి వెళ్ళమని తేజాని పంపేశాడు భూపేన్.

రాత్రికి రాత్రే టిక్కెట్లు తెప్పించి అపర్ణతో ఎయిర్‌పోర్టుకి బయలుదేరి వెళ్ళాడు భూపేన్.

ప్లేన్‌లో కూర్చున్న అపర్ణ మదిలో కొత్త, కొత్త ఆలోచనలు రాసాగాయి. "ఇప్పుడు నా జీవితంలో ఈ మలుపు ఎటు తోవ తీస్తుంది? నిజంగానే ఈ వ్యక్తి నన్ను నా వాళ్ళ దగ్గరికి చేరుస్తాడా? లేక తను నన్ను తన దగ్గర ఉంపుడు గత్తెగా ఉంచుకుంటాడా? నేను ఇలా రావడం మంచి పనా? చెడ్డపనా?" లాంటి ఆలోచనలు బుర్రని తొల్చేస్తుంటే, అటు భూపేన్ మాత్రం ఏదో నిర్ణయానికొచ్చిన వాడిలా నిశ్చింతగా సీటుకానుకుని నిద్రపోసాగాడు.

తను హైదరాబాద్‌లో ఉంటున్నప్పుడు రాజశేఖరం గారి పేరు విన్నాడు. ఒకటి రెండు సార్లు పార్టీలో కలిసినట్లు కూడా గుర్తు. అతను ఆ ఊళ్ళో పేరూ పరపతీ ఉన్న వ్యక్తుల్లో ఒకడు. కొన్నేళ్ళ క్రితం వాళ్ళమ్మాయి ఎవరితోటో లేచిపోయిందన్న వార్త ఊరంతా గుప్పుమనడం ఆ తరువాత ఆయన అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడనీ, భార్య మంచం పట్టిందన్న కబురు ఆ నోటా, ఈ నోటా విన్నాడు. తరువాత వారి గురించి ఏమీ తెలీలేదు. అయితే రాజశేఖరంగారమ్మాయి ఈ అపర్ణే అన్నమాట. మాలతి పేరు మార్చి అపర్ణగా తేజాగాడు ఇలా బిజినెస్ చేస్తున్నాడన్నమాట అని అనుకున్నాడు.

"ఈ రోజు ఉదయం అపర్ణ అంకుల్ అని పిలవడం వల్ల నాలో ఈ మార్పు వచ్చింది. అంతే కాదు. ఆ పిలుపు తనలోని మలినాన్ని కడిగేసి ఏదో ప్రశాంతతని తీసుకొచ్చిందొక్కక్షణంలో. ఇన్నేళ్ళుగా తను డబ్బుతో కొనుక్కునే దుర్వ్యసనాల సంఖ్యలనివల్లె వేసుకునేలా చేసిందా అంకుల్ అన్న పిలుపు. ఇంట్లో లక్షణమైన భార్య, పెద్దింటి నుంచి వచ్చిన స్త్రీయే. తనకో కొడుకూ, కూతురు. కొడుకు ఫారిన్‌లో చదువుకుంటున్నాడు. కూతురికి అపర్ణ వయసే

ఉండొచ్చు. ఇంట్లో అన్ని సుఖాలూ ఉన్నాయి. కోరినంత డబ్బుంది. ఆ డబ్బుందన్న అహంకారంతో చేతులారా తన జీవితాన్ని నరకం చేసుకుంటున్నాడు. భార్యా బిడ్డలకి తన వ్యసనాలు తెలిసి ఎంతో చులకనగా చూస్తున్నారు. మర్యాదైన కుటుంబాల్లోని స్త్రీలు నేను ఎదురు పడితే తప్పించుకుపోతారు. చవకబారు స్త్రీలు డబ్బు కోసం వచ్చేవారు మాత్రమే నన్ను పలుకరించి వెంట పడతారు. ఇలా ఇంకొన్నేళ్ళు ఈ వ్యసనాలతో జీవితం గడిపితే చేతులారా గొంతుకి ఉరితాడు బిగించుకున్నట్లే కదా! ఇంట్లో వాళ్ళని ఏడిపించి, నన్ను నేను నాశనం చేసుకుని ఎందుకిలా దుర్వ్యసనాలకి బానిసనవుతున్నాను. ఆ మధ్య డాక్టర్ ఓసారి వార్నింగ్ కూడా ఇచ్చాడు. అయినా ఏ వ్యసనం మాన్పుకోలేక పోతున్నాను. అలాంటిది ఇవాళ 'అంకుల్' అన్న అపర్ణ ఒక్క పిలుపు నా తప్పుల్ని ఎత్తి చూపించి, నే చేసిన పాపాల్ని కడుక్కోమని చెప్పింది. నిజమే! భార్య దగ్గర లేనిది వేశ్య దగ్గర ప్రత్యేకంగా ఏముంది? భార్య అప్యాయతతో అందించి పెట్టే అన్నం కంటే త్రాగుడులో ఏం మజా ఉంది. పేకాటలో వేలకి వేలు గడించినా, ప్రయోజనం? అదే డబ్బుతో ఓ మంచి పని చేస్తే. కష్టాల్లో ఉన్న ఓ వ్యక్తిని ఆదుకుంటే సంతోషంతో చెప్పే ఒక్క థేంక్సులో ఉండే ఆనందం వాటిలో వస్తుందా? ఈ రోజు ఎన్నో లక్షలిచ్చి అపర్ణని ఓ నరక కూపం నుండి విడిపించాను. పేకాటలో ఎన్నో వేలు గడించినప్పుడు, మత్తెక్కేదాకా తాగినప్పుడు, చకవబారు స్త్రీలతో తిరిగినప్పుడు కలిగిన ఆనందం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఆనందం ఈ రోజు కలుగుతోంది. ఇన్నాళ్ళకి ఓ మంచి పని, కాదు ఓ గొప్ప పని చేశావని మనసు చెబుతోంది. ఇకనయినా నీతిగా, బుద్ధిగా బ్రతుకమంటోంది మనసు. ఛీ... ఇన్నాళ్ళూ ఎన్నో తప్పుడు పనులు చేశాను. ఈ రోజు నుంచీ నేను మనిషిగా కాకుండా మనీషిగా బ్రతకాలనుకుంటున్నాను. తన భార్య దుర్వ్యసనాలని మానమని ఎన్నో ఏళ్ళుగా బ్రతిమాలుతున్నా మారని తన మనసుని ఒక్క అంకుల్ అన్న పిలుపు మార్చేసిందా? ఓ కాల్‌గర్ల్ పిల్చిన పిలుపు తనలోని మలినాన్నంతా కడిగేసిందా? అపర్ణలో ఇప్పుడు తన కూతురి రూపం కనబడుతోంది. నాకూతురికే ఇలా జరిగి ఉంటే? నా కొడుకే అపర్ణని మోసం చేసి ఉంటే?" ఇలా పరి పరి విధాల పోతున్న అతని మనసుకి కళ్ళెం వేస్తూ ప్లేను ఎయిర్ పోర్టులో దిగింది.

ఎయిర్ పోర్టు నుంచి బైటకొచ్చిన భూపేన్ అపర్ణని తీసుకుని తిన్నగా వర్కింగ్ గర్ల్స్ హాస్టల్‌కి తీసుకెళ్ళి తన పరపతినుపయోగించి ఓ గది తీసుకుని అందులో అపర్ణని ఉంచి మీ వాళ్ళ గురించి నేను హైదరాబాద్‌కి వెళ్ళినప్పుడు వాకబు చేసి తీసుకెళ్తానని చెప్పాడు.

తనకి తెలిసిన నిజాన్ని ఈ సమయంలో చెబితే తట్టుకోలేదేమో! మెల్లిగా చెప్పొచ్చులే అన్న భావంతో ఆమెతో అబద్ధం చెప్పాడు భూపేన్.

మర్నాడు వచ్చి "ప్రస్తుతానికి నీకో చిన్న ఉద్యోగం ఇప్పిస్తాను. అదీ నా ఆఫీసులోనే" అంటూ ఆమెని తనకి పి.ఏ.గా వేసుకుని జీతం వగైరాలు చెప్పి కొంత డబ్బు అడ్వాన్సుగా ఇచ్చి అవసరమైన వస్తువులు కొనుక్కోమని చెప్పాడు భూపేన్.

ఈ కొత్త వాతావరణానికి అలవాటు పడ్డ అపర్ణలో ఆత్మస్థయిర్యం వచ్చింది. ఆఫీసులో మాలతిగా పిలవబడసాగింది. ఏదో తృప్తి, ఆనందం ఆమె ముఖంలో స్పష్టంగా కనపడి, జీవితంలో ఓ స్థిరత్వం కలిగిందన్న ధైర్యం ఆమెలో కనబడి, తరువాత ఆమె తల్లితండ్రుల గురించి ఆమెతో తనకి తెలిసిన నిజాన్ని చెప్పి "మాలతీ! నాకీ విషయం నువ్వు అడ్రస్ ఇచ్చినప్పుడే తెలుసు. కానీ అనాడు చెబితే నువ్వు నాతో వచ్చేదానివి కాదు. అందుకు నీతో చెప్పలేదు. పరువు, మర్యాదల కోసం నీ తండ్రి ఆత్మహత్య చేసుకున్నారు. ఆ ఇంట్లో మిగిలిన వాళ్ళెవరున్నా, నిన్నీ రోజు ఆదరించి చేరదీసేవారనేముంది? ఓ కాల్ గర్ల్‌గా బ్రతికావని తెలిస్తే మళ్ళీ నిన్ను స్వీకరిస్తారనేముంది? ఒక్కసారి ఆలోచించు. నాకుగా నేను చెప్పే సలహా ఏమిటంటే పాత జీవితాన్ని కలగా మర్చిపోయి, నా దగ్గరకొచ్చి నప్పటి నుంచీ కొత్త జీవితాన్ని ప్రారంభించానని అనుకో! ఇప్పుడు నీకే లోటూ లేదు. నీ కాళ్ళ మీద నువ్వు నిలబడ్డావు. నీకు తండ్రిగా, ఓ గార్డియన్‌గా నేనున్నానని మర్చిపోకు. నీకు నచ్చిన వ్యక్తి నీ జీవితంలో ఎవరన్నా తారసపడితే నాతో చెప్పు. నేనతనికి అన్నీ చెప్పి, మాట్లాడి అందరి స్త్రీల్లాగే నిన్ను ఓ ఇంటి దాన్ని చేస్తానమ్మా!" అంటూ చెప్పుకుపోతున్న భూపేన్ని చూస్తూ అపర్ణ కన్నీరాపుకోలేక పాదాలపై పడుతూ "మీరు మనిషి కాదంకుల్! దేవుడు" అంటున్న మాలతితో "అమ్మా! మాలతీ నా కళ్ళు తెరిపించి నా జీవితాన్ని సన్మార్గంలో పెట్టిన నువ్వు నాకు కూతురిలాంటి దానివి. నా సంసారంలో కూడా సుఖ, శాంతుల్ని తీసుకొచ్చిన దేవతవమ్మా!" అంటూ చెమర్చిన కళ్ళతో మాలతిని లేవనెత్తి హృదయానికి హత్తుకున్నాడు భూపేన్. ✳

**( 1-15 ఏప్రిల్ 2003 సురభి పక్ష పత్రిక)**